క్లుప్తంగా

ఉరుకుంద అసిస్టెంట్ కమిషనర్‌గా రామాంజనేయులు



కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం అసిస్టెంట్ కమిషనర్‌గా రామాంజనేయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతన అసిస్టెంట్ కమిషనర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి ఆశీర్వాదం పొందిన అనంతరం విధుల్లో చేరారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు నాగరాజ్‌గౌడ్, ఆలయ సిబ్బంది సన్మానించారు. ఇక్కడ పని చేస్తున్న వాణి జిల్లా జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారిగా బదిలీ అయ్యారు.

కనీస వేతనం అందజేయాలి



తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కోసిగి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని వారు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఫీల్డు అసిస్టెంట్లు నిరసన తెలిపి తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు, ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లోకారెడ్డి, రాజేష్, మహాదేవ, అంజినేయ, మహబూబ్ బాషా, ఉశేని, ఎంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఎంకన్న, అధ్యక్షుడు అజయ్ కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సర్వీస్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు, జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని, కరోనా కాలంలో పనిచేసి సర్వీసులో మరణించిన వారికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈనెల 27వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీ, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో సమ్మెను చేపడతామని తెలిపారు. నాయకులు ఓబీ నాగరాజు, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు వై.టి.భీమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అబ్దుల్ రెహమాన్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం సృజన తెలిపారు. సోమవారం విద్యార్థిని అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 6వ తేదీల్లో నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్‌-14 క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు.

15 నుంచి ఆరాధనోత్సవాలు

ఆదోనిఅర్బన్: ఈనెల 15వ తేదీ నుంచి పట్టణంలోని బసాపురం రస్తాలో ఉన్న ఆలయంలో గవి వీరయ్యస్వామి వారి 95వ ఆరాధనోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త ఏసీ. శ్రీకాంతరెడ్డి సోమవారం తెలిపారు. ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ బి.పురుషోత్తంరెడ్డి పాల్గొంటారని చెప్పారు. హాళికోట మల్లయ్యస్వామి ఆధ్వర్యంలో పూజలు చేపడతామన్నారు. 15న ఉదయం స్వామివారికి మహారుద్రాభిషేకం, ధర్మ ధ్వజారోహణం తదితర విశేష పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

కౌతాళం: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్బారాజు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు, వెల్ఫేర్ , ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి పురోగతి సాధించాలన్నారు. ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్స్‌పై చర్చించారు. అలాగే మండలంలో జరుగుతున్న మరుగుదొడ్ల విషయంలో సమాచారం పూర్తిగా తెలుసుకుని పూర్తి చేయాలన్నారు. ఎంఈఓ శోభరాణి, సర్వశిక్షా అభియాన్ అసిస్టెంట్ ఇంజినీర్ శివశంకర్ పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు







మంత్రాలయంలో నవరత్నాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు, చెట్నహళ్లి సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కంబదహాల్‌లో వలంటీర్లకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఆదోని 28వ వార్డులో డిస్‌ప్లే బోర్డును ప్రదర్శిస్తున్న దృశ్యం



ఉరుకుందలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న దృశ్యం

మంత్రాలయం : అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాఘవేంద్ర నగర్‌లో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కాలనీలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులకు వివరించారు. కాలనీలో రోడ్లు ఎలా ఉన్నాయో గమనించాలని కోరారు. త్వరలో గడప గడప నిధులతో పెండింగ్‌లో ఉన్న రోడ్లు వేయిస్తామని చెప్పారు.వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్రాచారి, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమా రెడ్డి సూచించారు. సోమవారం చెట్నహళ్లి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో దాదాపు రూ.21.67 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సర్పంచ్ అంజిని, ఎంపీటీసీ రామాంజనేయులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనేనని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కంబదహాల్ గ్రామంలో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వలంటీర్లకు వై ఏపీ నీడ్స్ జగన్ కిట్లును పంపిణీ చేశారు. ఎలాంటి దళారీ వ్యవస్థ లేని ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని కోరారు.

జగనన్నను మళ్లీ గెలిపిద్దాం..

ఆదోనిటౌన్: జగనన్నను మరోసారి గెలిపిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కన్వీనర్ మధుసూదనశర్మ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 28వ వార్డు షరాఫ్‌బజార్, 30వ వార్డు షరాఫ్‌బజార్, 31వ వార్డు మరాఠీగేరి ఏరియాల్లోని సచివాలయాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, కౌన్సిలర్ పద్మ, నాయకులు లక్ష్మన్న, జైపాల్, రామంజి, వెంకటేశులు, పర్వీన్‌భాను, శంకర్, రంగన్న, రాజు, దస్తగిరి, కన్వీనర్‌లు బసవరాజ్, మహబూబ్‌బాషా, రాందాస్ పాల్గొన్నారు.

కౌతాళం: ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని ఉరుకుంద గ్రామంలో మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉరుకుందలో రూ. 36.37కోట్లతో జరిగిన సంక్షేమాభివృద్ధిని వివరించారు.

భక్తులతో కిటకిటలాడిన ఉరుకుంద



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



దాతలకు బాండ్, స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం



దాతలకు బాండ్ అందజేస్తున్న ఆలయ అధికారి

కౌతాళం: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఉరుకుంద ఈరన్న స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలో పాటు, కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మహిళలు ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. పలువురు భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవైద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం భక్తులు విరాళం అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. పెంచికలపాడుకు చెందిన కుమ్మరి రాధమ్మ, కమ్మరి రాఘవయ్యాచారి కుటుంబ సభ్యులు రూ.1,01,116, శాశ్వత నిత్యాన్నదానం పథకానికి రూ.50,116, అలాగే గో సంరక్షణకు రూ.50,116 విరాళంగా, అలాగే ఆలయంలో చేపడుతున్న పలు జీర్ణోద్ధరణ పనుల కోసం బళ్లారికి చెందిన కె. వీరేష్‌బాబు, కుటుంబ సభ్యులు రూ.80 వేలు దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర' పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథరామయ్య

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణలో పూర్తి స్థాయి పారదర్శకత పాటించాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌కు సంబంధించి గ్రామ వలంటీర్లు అంపైరింగ్, పంచాయతీ కార్యదర్శులకు టోర్నమెంట్ నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడా కార్యక్రమం నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ ఈ ఐదు క్రీడాంశాల్లో నిర్వహించే మెగా టోర్నీ తొలుత సచివాలయ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. టోర్నీ నిర్వహణకు మండలంలో 6 మైదానాలను పరిశీలించినట్లు చెప్పారు. అలాగే మాస్టర్ ట్రైనర్లు వెల్ఫేర్ అసిస్టెంట్లకు మ్యాచ్‌ల నిర్వహణ, లైవ్ స్కోరును ఏ విధంగా మొబైల్‌లో అప్‌లోడ్ చేయాలనే అన్ని అంశాలపై శిక్షణ ఇచ్చారు. వలంటీర్లు అంపైరింగ్, నిర్వహణలో ఎలా మెలగాలో వివరించారు. ఈ నెల 15 నుంచి జనవరి 5వ తేదీ వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంఈఓలు-1, 2 సుదర్శన్ రెడ్డి, రఘునాథ్‌లు, ఫిజికల్ డైరక్టర్లు మహమ్మద్ హనీఫ్, ప్రశాంతి పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

తుగ్గలి: పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని సర్పంచ్ బనావత్ లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణనాయక్ అన్నారు. జలజీవన్ మిషన్ కింద పంచాయతీకి మంజూరైన నిధులతో మిద్దెతండా, చిగుర్లగుట్టతండా వద్ద చేపట్టిన పైపులైన్ పనులను వారు సోమవారం ప్రారంభించారు. జలజీవన్ మిషన్ కింద చిగుర్లగుట్ట పంచాయతీకి మొత్తం రూ.89.70 లక్షలు మంజూరైందన్నారు. ఈ నిధులతో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని చెప్పారు. మాజీ ఎంపీపీ నారాయణ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణానాయక్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

మద్దికెర: సాయినగర్, రాంనగర్ కాలనీలలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి అన్నారు. ఆయా కాలనీలు ఏర్పడినప్పటి నుంచి స్థానికులు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత పాలకులు వారిని నిర్లక్ష్యం చేశారని, వైఎస్సార్‌సీపీ హయాంలో జలజీవన్ మిషన్ కింద త్వరలో పనులు పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామన్నారు. ఇప్పటికే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టామని పైపులైన్లు పనులు పూర్తి చేసి కాలనీలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



మిద్దెతండ వద్ద పైపులైన్ ఏర్పాటు పనులు చేస్తున్న దృశ్యం

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



ప్రజల సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డీయల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కె.లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్‌లు వలీబాషా, కౌసర్‌బాను, రమాదేవి పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- నందవరం మండలం పులిచింత గ్రామానికి చెందిన మాణిక్యంకు సర్వే నంబర్ 60/ఏలో 1.16 ఎకరాల భూమి ప్రభుత్వం నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం వేరే వారి పేరు నమోదైందని, విచారణ చేసి తన పేరుతో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- తాము ఎస్సీలమైనా మా అమ్మ ఈరమ్మ పేరుతో ఉండే విద్యుత్ మీటర్‌కు సంబంధించి ఓసీ కులం అని తప్పుగా చూపుతోందని, దీంతో తాము ప్రభుత్వం అందిస్తున్న రాయితీని కోల్పోతున్నామని విచారణ చేసి తమకు న్యాయం చేయాలని ఆదోని పట్టణం న్యూగాంధీనగర్ ఎస్సీ కాలనీకి చెందిన హుసేనప్ప అర్జీ అందజేశారు.
- ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన హైమావతికి నందవరం మండలం ముగితి గ్రామంలో సర్వే నంబర్ 31లో 2.44 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించింది. ప్రస్తుతం ఆక్రమణకు గురై ఆన్‌లైన్‌లో వేరే వారి పేరుతో నమోదైందని, విచారించి తమ పేరుతో నమోదు చేయాలని కోరారు.

రేపు హిందూ సమ్మేళనం

కౌతాళం: సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తామని ప్రజలు తరలిరావాలని ఫౌండేషన్ ఆదోని ఖండధర్మ ప్రచారక్ నాగరాజు, హిందూ ధార్మిక సంస్థల నాయకులు చంద్రశేఖర్, నరేష్‌లు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన స్థానిక కృష్ణావధూత ఆశ్రమంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఈరన్న, పంపాపతి, ముసలయ్యతో కలిసి విడుదల చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోనిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డీఈ నాగభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ వార్డులకు చెందిన ప్రజలు తాగునీటి సరఫరా, అక్రమ కట్టడాలు, వీధి లైట్ల ఏర్పాటు, ఆస్తి పన్ను తదితర వాటిని పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. విచారణ చేసి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

ఆదోనిఅర్బన్: పట్టణంలో సోమవారం మతిస్థిమితం లేని వ్యక్తి టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద హల్‌చల్ చేశాడు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను అడ్డగించి వారి తన బట్టలు వేసి ఇబ్బంది పెట్టాడు. లారీలు, కార్లను ఆపి వాటిపై ఎక్కి భయాందోళనకు గురి చేశాడు. వెంటనే టూటౌన్ పోలీసులు ఆయనను సిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద వదిలేశారు.

ఎస్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

ఆదోని సెంట్రల్: కర్నూలు పట్టణంలోని సలాం ఖాన్ ఎస్‌టీయూ భవన్‌లో శని, ఆదివారాల్లో జరిగిన జిల్లా వార్షిక కార్యవర్గ సమావేశంలో ఆదోని పట్టణ నాయకులకు చోటు దక్కిందని పట్టణ అధ్యక్ష కార్యదర్శి భీమరాజు, రవి సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిలర్లుగా సి.నాగరాజు, ఎస్.లోక్యనాయక్, వీరచంద్రయాదవ్‌తో పాటు జిల్లా ఉపాధ్యక్షుడిగా రమేష్ నాయుడు, జిల్లా కార్యదర్శిగా ఎంబీ. కళ్యాణి ఎన్నికయ్యారని చెప్పారు. వారికి స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి



ఆడుదాం ఆంధ్ర క్రీడల కిట్లు అందజేస్తున్న పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో తమ ప్రతిభను చాటాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర క్రీడల కిట్లను సచివాలయాల వారీగా పంపిణీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోనే ఈనెల 13వ తేదీ వరకు ఆసక్తి గల క్రీడల్లో రాణించేందుకు తమ వలంటీర్ల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. 15 నుంచి 19వ తేదీ వరకు సచివాలయ పరిధిలో 6 రోజుల పాటు, ఈనెల 21 నుంచి జనవరి 10వ తేదీ వరకు మండల స్థాయిలో ఆటల పోటీలు ఉంటాయని వివరించారు. ప్రతి సచివాలయానికి ఒక స్పోర్ట్స్ కిట్ మంజూరైందని చెప్పారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, నాయకులు కోసిగయ్య, మాణిక్యరాజు, మహంతేష్ స్వామి, బుళ్లి నరసింహులు, సౌకత్ ఆలి, ముకుంద క్రిష్ణమూర్తి, దొడ్డి నరసన్న, నరసింహులు గౌడ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో 12మంది అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: పార్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకుల నరసింహులుపై హత్యాయత్నం చేసిన కేసులో 12 మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం సాయంత్రం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేది రాత్రి పార్లపల్లి గ్రామానికి చెందిన నరసింహులుపై ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన 12 మంది దాడి చేసినట్లు చెప్పారు. పందుల దొంగతనంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాడనే భయంతో పట్టణానికి చెందిన ఎరుకుల భీమన్న, రంగన్న, బుల్లి నాగరాజు, హరి, మారెన్న, రంగన్న, రాజేష్, నాగరాజు, సుంకన్న, పరుశురాం, మహేంద్ర, వీరేంద్రలు కలిసి నరసింహులుపై దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఈ కేసులో 12 మందని అరెస్ట్ చేసి జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ఆలూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులచే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించేందుకు ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆలూరు హౌసింగ్ డీఈ ఆదినారాయణ ఆదేశించారు. దేవనకొండ మండలం గుండ్లకొండ, పెద్దకోటకొండ, నల్లచెల్లిమల గ్రామాల్లోని జగనన్న కాలనీలను ఆయన సోమవారం పరిశీలించారు. గృహ నిర్మాణాలను పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..

ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, హొళగుంద మండలాల్లో దాదాపు 90 లేఅవుట్లలో 5800 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో ఇప్పటివరకు 2300 గృహాలు పూర్తయినట్లు చెప్పారు. హాలహర్వి మండలం టి.చాకిబండ గ్రామ సర్పంచ్ బోయ ఒబులపతి థర్డ్ పార్టీగా 20 గృహాల వరకు పూర్తి చేయించారని డీఈ ఆదినారాయణ చెప్పారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు గృహ నిర్మాణలు వేగవంతం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆలూరు రూరల్: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని బెంగళూరుకు చెందిన రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి గగారియన్ సూచించారు. ఆయన సోమవారం ఆలూరు గిరిజన ఆశ్రమ బాలికలు, బాలుర పాఠశాల విద్యార్థులకు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు ఎలా సాధించాలన్న అంశంపై సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. తరగతిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఎప్పటికప్పుడు చదువుకోవాలన్నారు. భయం వీడి ధైర్యంగా పరీక్షలు రాస్తే విజయం వశమవుతుందన్నారు. క్రమ పద్ధతిలో చదివితే పరీక్షలలో ప్రతి ప్రశ్నకు సమాధానం రాయడం సులువు అవుతుందని వివరించారు. పాఠశాలలోని సౌకర్యాలను ఉపయోగించుకుని బాగా చదివాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం జమ్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో కొలువైన చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఆసక్తి గల జట్లు 15వ తేదీలోపు రూ.550 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. 16, 17 తేదీల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. విజేతలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో రూ.51 వేలు, రెండో బహుమతి ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ రూ.25 వేలు, మూడవ బహుమతి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు హరేరామ్ తిక్కన్న రూ.10,116, నాలుగవ బహుమతి రూ.5,116 వాల్మీకి నాయకుడు లోకేష్ సహకారంతో అందించనున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన బోయ చిట్టెన్న సహకారంతో క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 90141 55679, 77807 98441 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

చిప్పగిరి: రబీలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. రైతులు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పట్టాదార్ పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ కార్డుతో పంట నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే పథకాలకు పంటల నమోదే ప్రామాణికంగా ఉంటుందని చెప్పారు. ఏఈఓ రమాదేవి, ఎంపీఈఓ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆరేకల్, నాగలాపురంలో వికసిత్ భారత్

ఆదోనిరూరల్: మండలంలోని ఆరేకల్, నాగలాపురం గ్రామాల్లో సోమవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకా అర్హులైన వారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీజేపీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్, నాగలాపురం సర్పంచ్, ఏపీఓ చంద్రశేఖర్, పశుసంవర్ధకశాఖ డాక్టర్ వంశీ, నాయకులు ఉపేంద్ర, కోటియాదవ్, గోపి, అంజయ్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై నేడు సదస్సు

ఆదోనిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం భూ న్యాయనిపుణులు సునీల్‌కుమార్ ఆదోనికి వస్తున్నారని ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనితాబాయి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ మంగళవారం స్థానిక రోషనల్ గార్డెన్‌లో జరిగే సదస్సుకు వివిధ జిల్లాల బార్ అసోసియేషన్ నాయకులు హాజరవుతారని చెప్పారు.ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై సీనియర్ న్యాయవాదులు లాభనష్టాలు వివరిస్తారన్నారు. కార్యక్రమాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.